www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 14 నవంబరు 2022 5 ఏలూరు



శిశువు అపహరణకు యత్నం

ప్రజాశక్తి - ఏలూరు

శిశువును అపహరించేందుకు ఓ మహిళ యత్నించిన ఘటన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గత మూడు రోజులుగా భార్గవి అనే మహిళ ఆసుపత్రిలో కలయతిరుగుతోంది. ఓ గర్భిణీ బంధువుగా చెబుతూ ఆసుపత్రి పరిసరాల్లో తిరిగింది. ఈ క్రమంలో ఆదివారం శిశువుతో పారిపోవడానికి యత్నించింది. గమనించిన ఆసుపత్రి సిబ్బంది ఆమెను పట్టుకుని బిడ్డను తల్లికి అప్పగించారు. అనంతరం ఆ మహిళను పోలీసులకు అప్పగించారు.



శిశువు అపహరణకు యత్నించిన మహిళ

లోపాల్లేకుండా 'పోలవరం' పనులు

రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి తప్పిదాలకూ, సాంకేతిక లోపాలకూ తావులేకుండా పనులు చేపడుతున్నామని రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుని ఆయన ఆదివారం పరిశీలించారు. శనివారం రాత్రి పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న ఆయన రాత్రి ప్రాజెక్టు అతిథి గృహంలో బస చేశారు. ఉదయం హిల్‌వ్యూ ప్రాంతానికి చేరుకుని అక్కడి నుండి స్పిల్‌వే పనులను పరిశీలించారు. అనంతరం ఎగువ కాపర్ డ్యామ్‌పై నుండి ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య జరుగుతున్న ఇసుక నింపే పనులను పరిశీలించారు. అనంతరం గ్యాప్ 1,2,3 ప్రాంతాలను, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల నడుమ జరుగుతున్న పియు గ్రౌడింగ్ పనులను, పున:ప్రారంభమైన దిగువ కాపర్ డ్యాం పనులను పరిశీలించారు. ఆరో నెంబర్ హిల్ ప్రాంతంలో జరుగుతున్న పనులను, దిగువ కాపర్ డ్యాం వద్ద డీ వాటరింగ్ పంపింగ్ పనులను పరిశీలించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద ప్రభావం తగ్గడంతో పనులు పున:ప్రారంభిస్తున్నామన్నారు. ముందుగా దిగువ కాపర్‌డ్యామ్ పనులు ప్రారంభించామన్నారు. వరద జలాల నీటిమట్టం పూర్తిస్థాయిలో తగ్గిన తర్వాత ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య ఉన్న, డయాఫ్రం వాల్ చుట్టూ ఉన్న నీటిని తొలగించామని, అనంతరం నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ అధికారులు పరీక్షలు నిర్వహిస్తారని, వారి సూచనల మేరకు డయాఫ్రం వాల్ పున:నిర్మించాలా లేదా పాత దాని మీదే ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మించాలా అనే విషయాలపై చర్చిస్తామన్నారు. అప్పటివరకూ దిగువ కాపర్ డ్యామ్ పనులు పూర్తిచేసి, వర్కింగ్ ప్లేస్‌ని పూర్తి చేస్తామని చెప్పారు. కాపర్ డ్యాముల నిర్మాణం పూర్తి కాకుండా డయాఫ్రంవాల్ నిర్మించడం చారిత్రాత్మక తప్పిదమని, ఆ సమస్యను అధిగమించడానికి ఎక్కువ సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయని, సాధ్యమైనంత త్వరగా డయాఫ్రంవాల్ స్థితిగతులు అంచనా వేస్తామన్నారు. పిపిఎ అనుమతులు, సూచనల మేరకు ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. స్పిల్‌వే నిర్మాణం పూర్తయిందని, ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించి పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ఏడాది ఈ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ వారు డయాఫ్రంవాల్‌ను పరిశీలించి, తగిన సూచనలు చేయకుండా ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం పనులు ముందుకుసాగే అవకాశం లేదన్నారు. మంత్రివెంట పోలవరం ప్రాజెక్ట్ ఎస్ఇ నరసింహమూర్తి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ ఉన్నారు.



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి అంబటి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు మెండు

జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ఏసుదాసు


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడిక పశ్చిమగోదావరి జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని పరిశ్రమల శాఖ జిఎం ఏసుదాసు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పారిశ్రామిక పథకాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో ప్రత్యేకంగా కొన్ని విషయాలను పంచుకున్నారు.



ప్రశ్న : ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి?

ఈ ఏడాది మార్చి వరకూ 2610 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రూ.432.00 కోట్లతో స్థాపించబడ్డాయి. పరిశ్రమల శాఖ ద్వారా 39,320 మందికి ఉపాధి కల్పిస్తున్నాము. ఇందులో 31 భారీ పరిశ్రమలు రూ.2254.00 కోట్లతో స్థాపించబడ్డాయి. 11,268 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.



ప్రశ్న : 2022-23 సంవత్సరంలో కొత్తగా స్థాపించబడిన పరిశ్రమలు ఎన్ని?

2003 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రూ.175.52 కోట్లతో స్థాపించబడి 8006 మందికి ఉపాధి కల్పిస్తున్నాము.

ప్రశ్న : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం వివరాలు తెలపగలరు?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో 2021-22 సంవత్సరానికి 82 యూనిట్లు లక్ష్యంకాగా, 339 దరఖాస్తులు వివిధ బ్యాంకులకు సిఫార్సు చేశాము. అందులో 128 యూనిట్లు మంజూరు కాగా 111 యూనిట్లు స్థాపించబడ్డాయి. రూ.413.42 లక్షల మార్జిన్ మనీ విడుదల చేయబడింది. 2022-23 సంవత్సరానికి 116 యూనిట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు 77 దరఖాస్తులు వివిధ బ్యాంకులకు పంపగా, అందులో 43 యూనిట్లు మంజూరయ్యాయి. అందులో 27 యూనిట్లు స్థాపించబడ్డాయి.

ప్రశ్న : సింగిల్ డెస్క్ ద్వారా వివిధ పరిశ్రమలకు అనుమతులిచ్చారా?

సింగిల్ డెస్క్ ద్వారా 2022-23 సంవత్సరానికి వివిధ పరిశ్రమలకు సంబంధించి 151 అనుమతుల కోసం సంబంధిత శాఖలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా అందులో 144 యూనిట్లకు అనుమతులు మంజూరయ్యాయి. అందులో మూడు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రోత్సాహక పెట్టుబడి విధానం, పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020-23 పాలసీ, పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020-23లో ఇప్పటివరకూ వివిధ పరిశ్రమలు (139) దరఖాస్తు చేసిన 234 క్లెయిములకు రూ.10.28 కోట్లు రాయితీలు మంజూరయ్యాయి. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం 2020-23లో, షెడ్యూల్డ్ కులాలవారు దరఖాస్తు చేసిన 214 యూనిట్లలో ఇప్పటివరకూ 127 క్లెయిములకు రూ.7.39 కోట్ల రాయితీలు మంజూరు చేశాము. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం 2020-23లో షెడ్యూల్డ్ తెగల వారు దరఖాస్తు చేసిన 21 యూనిట్లకుగాను, ఇప్పటి వరకూ తొమ్మిది యూనిట్లకు రూ.0.50 కోట్ల రాయితీలు మంజూరు చేశాము.

ప్రశ్న : పారిశ్రామికవేత్తలకు కావాల్సిన లక్షణాలేంటి?

మంచి వ్యాపార లక్షణం, నిర్ణీత సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం, వేగంగా స్పందించడం ఉండాలి. దాంతోపాటుగా సహనం, ప్రణాళికా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, కార్మికుల క్షేమం కోరుకోవడం, తనపై అందరికీ నమ్మకం కలిగేలా నడుచుకోవాలి.


ప్రశ్న : పరిశ్రమల స్థాపనలో స్థూల అంశాలేంటి?

ఉత్పత్తులు, సర్వీసులు ఎంపిక చేసుకోవడం, మార్కెట్ పరిస్థితులను సర్వే చేస్తుండడం ఉండాలి. ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలి. పరిశ్రమల స్థాపనకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి. వివిధ ప్రభుత్వ శాఖల అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలి. ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేయాలి. పరిశ్రమకు అవసరమైన భవనాల నిర్మాణం, యంత్రాలను కొనుగోలు చేయాలి.

నేడు స్పందన యథాతథం

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో నవంబర్ 14వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి 'స్పందన' యథావిధిగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.



దీక్షలో పాల్గొన్న నిర్వాసితులు

నిర్వాసితుల గోడు పట్టని ప్రభుత్వాలు

ఏడో రోజు రిలే దీక్షలో 'పోలవరం' నిర్వాసితులు

ప్రజాశక్తి - కుకునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఉన్న ఊరిని, విలువైన భూములను వదులుకోవడానికి సిద్ధంగా ఉన్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకుండా వ్యవహరించడం సరికాదని నిర్వాసితులసంఘం నాయకులు వై.సాయికిరణ్ విమర్శించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా నిర్వాసితులను వివిధ సర్వేల పేరుతో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు తప్ప వారి సమస్యలను తీర్చలేదన్నారు. దీనికి తోడు ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు ఇళ్లు మునిగి తీరని నష్టం జరిగినా ప్రభుత్వం నుండి పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్వాసితుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారంరోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా అటు ప్రభుత్వం కానీ ఇటు అధికారులు కానీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిముంపులో ఉన్న నాలుగు గ్రామాలను 41.15 కాంటూరు పరిధిలో చేర్చాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు రిలే దీక్షలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ దీక్షలో నిర్వాసితుల సంఘం నాయకులు బాబు, కుమారి, సంజీవరావు, లక్ష్మీ, రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో హాజరైన నాయకులు

పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన

ప్రజాశక్తి - కలిదిండి

కార్మిక హక్కుల సాధన కోసం పోరాటాలే మార్గమని, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) మండల కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డు నుండి రూ.1250 కోట్లు దారి మళ్లించిందని, 1214 మెమో జారీ చేసి కార్మికులను మోసగించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న చట్టాలను రద్దు చేసి అన్యాయం చేసిందన్నారు. మూడున్నరేళ్లలో నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితం కావాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కటికల శ్రీను, పరసా రాజేష్, పోతురాజు, బాలాజీ, అబ్బులు అక్బర్, సుంకర హరి, బత్తిన సూరిబాబు పాల్గొన్నారు.

రిలయన్స్‌తో ఒప్పందం సరికాదు

ప్రజాశక్తి - ఏలూరు

క్షౌర వృత్తిలోకి రిలయన్స్ కార్పొరేషన్ సంస్థ నేచురల్ సెలూన్స్ సంస్థతో 49 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం చేసుకోవడాన్ని ఏపి బిసి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ పత్తిపాటి రామకృష్ణ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. క్షౌరవృత్తిపై ఆధారపడి జీవించే లక్షలాదిమంది వృత్తిదారుల జీవనోపాధిని హరించే ఒప్పందాన్ని రద్దుచేసి క్షౌరవృత్తిదారులకు ఊరట కలిగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

న్యాయసేవాధికార సంస్థను వినియోగించుకోండి

బుట్టాయగూడెం: బడుగు, బలహీన, గిరిజన, నిరుపేదలకు బార్ అసోసియేషన్ న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ జిఎస్ఆర్.మూర్తి, సభ్యులు మేకల రామ్మోహన్‌రావు, జువ్వల బాపూజీ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు ఆదివాసి ఐక్యకార్యాచరణ కమిటీ (జెఎసి) జిల్లా కార్యవర్గ సభ్యులు నడపాల సోమరాజు, సరియం రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. అనంతరం సరుగుడు ఆర్అండ్ఆర్ కాలనీలో ఉచిత న్యాయ సలహాలు అందించేందుకు తెల్లదిబ్బలు, సరుగుడు గ్రామస్తులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సాకు నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అన్యాయం జరిగితే గిరిజనులు ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందిపడుతున్నారని, ఇలాంటి సందర్భంలో వారికి ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తామన్నారు. సమాజంలో ప్రతీపౌరుడు భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది భద్రం, పొడియం శివకృష్ణ, రాంబాబు, సుశీల, శ్రీను, పాములేటి రామిరెడ్డి, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



దగ్ధమైన ముడి సరుకు

స్పిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం

ఇద్దరికి గాయాలు

సుమారు రూ.తొమ్మిది కోట్ల ఆస్తి నష్టం

షార్ట్‌సర్క్యూట్‌తో ఘటన

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని ముప్పవరం జాతీయ రహదారి పక్కన ఉన్న స్పిన్నింగ్ (దారాలు) మిల్లులో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. మిల్లు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా ఎలాంటి ప్రాణ నష్టమూ సంభవించకపోవడంతో ఇటు యాజమాన్యం, అటు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సకాలంలో అగ్నిమాపక శాఖ స్పందించడంతో మంటలను అదుపుచేశారు. అయితే అప్పటికే మిల్లులోని మిషనరీ, ముడిసరుకు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.తొమ్మిది కోట్ల నుంచి రూ.12 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. ముప్పవరం పరిధిలో యర్రా స్పిన్నర్స్ పేరుతో గత కొంత కాలంగా ఆ సంస్థ మేనేజింగ్ డెరెక్టర్ వై.శ్రీనివాసరావు స్పిన్నింగ్ మిల్లు నిర్వహిస్తున్నారు. ఈ మిల్లులో సుమారు 40 మంది వరకూ పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం పది గంటల ప్రాంతంలో మిల్లులోని రెండో షట్టర్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో ఈ ప్రమాదం సంభవించినట్లు మిల్లులో పనిచేస్తున్న కార్మికులు తెలిపారు. ఆ సమయంలో సుమారు 20 మంది మహిళా కార్మికులతోపాటు పురుషులు కూడా పనిచేస్తున్నారు. వారంతా బయటకు పరుగులు తీశారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అయితే ప్రమాదం స్థాయి తీవ్రంగా ఉండటంతో జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణకు వివరాలు అందించారు. దీంతో ఆయన తమ సిబ్బందితో ఏలూరు నుంచి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆయన ఆదేశాల మేరకు ఏలూరు నుంచి రెండు ఫైరింజన్లు, భీమడోలు నుంచి ఒక ఫైరింజన్, తాడేపల్లిగూడెం నుంచి ఒక ఫైరింజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో మిల్లు మేనేజింగ్ డెరెక్టర్ శ్రీనివాసరావు, ఫిట్టర్ జె.తిరుమలరావుకు తీవ్ర గాయాలయ్యాయి. దెందులూరు తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య ఆదేశాలు మేరకు వారికి ప్రథమ చికిత్స అందించారు. తహశీల్దార్ మిల్లును పరిశీలించి వివరాలను ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ ప్రమాదంలో మిల్లులోని యంత్రాలు, ముడి సరుకులు పూర్తిగా కాలిపోయాయి. వీటి విలువ సుమారు రూ.తొమ్మిది కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకూ ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ మిల్లు పనిచేయటం వల్ల కార్మిక శాఖ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

రొయ్య ధర పతనం

వంద కౌంటు వనామి రొయ్య ధర కిలో రూ.180

విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడమే కారణమంటున్న వ్యాపారులు

14న ఉండిలో ఆక్వా రైతుల సమస్యలపై నిరసన



ప్రజాశక్తి - కాళ్ల

ప్రస్తుతం ఆక్వా రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు కొనుగోళ్లు బాగా తగ్గించడం వల్ల మార్కెట్లో రొయ్య ధర దారుణంగా పతనమైంది. రెండు నెలల్లో వంద కౌంట్ వనామీ రొయ్యల ధర కిలో రూ.310 నుంచి రూ.180కు దిగజారింది. విదేశాల నుంచి ఆర్డర్లు లేక ప్రాసెసింగ్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజీలు రొయ్యల నిల్వలతో నిండిపోయాయి. రొయ్యల సాగు ఖర్చు బాగా పెరిగిపోయింది. రూ.లక్షల నష్టాలతో రొయ్య రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. జనవరి వరకు ఆగి ఫిబ్రవరి నుంచి పండుగప్ప సాగు చేయాలనే ఆలోచనలో కొంతమంది రైతులున్నారు. ఉమ్మడి జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.2 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వార్షిక ఉత్పత్తి నాలుగు లక్షల టన్నులు. వార్షిక ఆదాయం రూ.18 వేల కోట్లు. 24 శీతల గిడ్డంగులు ఉన్నాయి.

ఆక్వా మార్కెట్ కుదేలు

విదేశాలకు ఆర్డర్లు తగ్గడంతో అక్టోబర్ నుంచి ఆక్వా మార్కెట్ కుదేలైంది. వంద కౌంటు వనామీ రొయ్య ధర రూ.210కి, 20 కౌంటు రొయ్య ధర రూ.480కు పడిపోయింది. ఆక్వారైతులు గగ్గోలు పెట్టడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని వంద కౌంటుకు రూ.240 చెల్లించాలని వ్యాపారులను ఆదేశించింది. అయితే ఆ ధర చెల్లించడానికి వ్యాపారులు సుముఖత చూపడం లేదు. ఈక్వేడార్ దేశంలో రొయ్య దిగుబడులు బాగా వచ్చాయి. చైనా, అమెరికా మార్కెట్లకు ఈక్వేడార్ రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. దీంతో మన ప్రాంతం నుంచి ఎగుమతులు నిలిచిపోయాయి.

వెంటాడుతున్న వైరస్‌లు

మొన్నటి వరకు అధిక వర్షాలు, ప్రస్తుతం చలి వాతావరణం కారణంగా విబ్రియో, వైట్‌స్పాట్ వైరస్‌లు విజృంభించి రొయ్యల దిగుబడులు 50 శాతానికి పడిపోయాయి. వైట్‌స్పాట్ సమస్య కారణంగా దుబాయ్, సౌదీఅరేబియా, ఖతార్, ఒమన్ దేశాలు మన రొయ్యల కొనుగోళ్లు పూర్తిగా నిలిపివేశాయి. ఆర్థికమాంద్యం నేపథ్యంలో యూరోపియన్ దేశాలకు ఎగుమతులు భారీగా క్షీణించాయి. ఎగుమతులు పూర్తిగా బంద్ కావడంతో ఆ ప్రభావం రొయ్యల మార్కెట్లపై పడింది. కోల్డ్ స్టోరేజీల నిండా రెండు నెలల క్రితం కొనుగోలు చేసిన రొయ్యలున్నాయి. దీంతో వ్యాపారులు కొనుగోళ్లు చాలావరకూ ఆపేశారు.

పెరిగిన సాగు ఖర్చులు

గతంలో వంద కౌంటు కేజీ రొయ్యల సాగు ఖర్చు రూ150 నుంచిరూ 160 వరకు ఉండేది. మేత, మందులు,చెరువు లీజు, కూలీల వేతనాలు, కరెంటు బిల్లులు పెరగడంతో వంద కౌంటు కేజీ వనామీ రొయ్యల సాగు ఖర్చురూ 240కు చేరుకుంది. ప్రస్తుతం మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేసిన వెంటనే చెల్లించాలంటే రైతుకు కేజీకి రూ 180 ఇస్తున్నారు. మూడు వారాలు ఆగితే రూ 190 చెల్లిస్తున్నారు. ఆక్వా రైతులు కేజీ రూ 50 నుంచి 60 రూపాయల వరకు నష్టపోతున్నారు. ఎకరాకు లక్షల్లో నష్టం వస్తుంది.ఐదారు నెలలు ఇదే పరిస్థితి ఉంటుందని ఆక్వా మార్కెట్ నిపుణులు అంటున్నారు. మరలా విదేశాలకు ఎగుమతులు ఆర్డర్లు భారీగా వస్తేనే ధరలు పెరుగుతాయని చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే

ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న రంగం ఆక్వా. అయితే దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ లేకపోయినా మొదటి నుంచి రైతులే కష్టనష్టాలను ఎదుర్కొని సాగు చేస్తున్నారు. ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం నామమాత్రంగానే చర్యలు తీసుకుంటుంది. మూడేళ్లుగా రొయ్యల మేత ధరలు పెరుగుతున్న తీరుపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తులు సాధిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా నాయకులకు మాత్రం పట్టడం లేదు. వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వసతుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక నష్టాలపాలవుతున్నారు.

14న ఉండిలో ఆక్వా రైతుల సమస్యలపై నిరసన

ఈ నెల 14న ఉండిలో ఆక్వా రైతుల సమస్యలపై నిరసన కార్యక్రమం జరగనుంది. టిడిపి ఆధ్వర్యాన ఉండి ఎంఎల్ఎ ఎమ్మెల్యే మంతెన రామరాజు నాయకత్వాన నిరసన చేపట్టనున్నారు. ఆక్వా ఫీడ్, సీడ్ చట్టాలను తీసుకొచ్చామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం వాటి నాణ్యత విషయంలో సరైన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రొయ్యల ధర తగ్గింది

నంబూరి త్రినాధమూర్తిరాజు, ఆక్వా రైతు, కలవపూడి



ఈ ఏడాది రొయ్యల సాగు అతలాకుతలమైంది. రొయ్యల ధర గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఎక్కువ దిగుబడి వచ్చిన సమయంలో ధర దారుణంగా పడిపోయింది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు మేత ధరలు పెరిగిపోవడం రైతులను ఇబ్బంది పెడుతోంది. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు కొనుగోళ్లు తగ్గించారు. దీంతో రొయ్యల ధర పడిపోయింది.

వైద్యులు, మందుల కొరత లేకుండా చూడాలి : సిపిఎం

భీమడోలు: భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, వైద్యులు, మందుల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో సిపిఎం బృందం సిహెచ్‌సిని ఆదివారం సందర్శించారు. రోగులతో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం వైద్యులను కలిసి రోగులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ ఈ ఆసుపత్రిని నియోజకవర్గ స్థాయిలో ప్రసూతి సేవలతో పాటు సదరం శిబిరాల నిర్వహణ, కోవిడ్ సేవలందించేందుకు ప్రత్యేకించారన్నారు. ఇదే క్రమంలో దాదాపుగా రెండు లక్షల మంది ప్రజలు కామవరపుకోట, ద్వారకాతిరుమల, భీమడోలు,ఉంగుటూరు మండలాలకు చెందిన తొమ్మిది పిహెచ్‌సిల పరిధిలోని రెండు లక్షల మంది ప్రజలకు మధ్యంతర వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేశారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని సామాజిక ఆరోగ్య కేంద్రానికి కోట్లాది రూపాయల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారని, కానీ రోగులకు సేవలందించేందుకు అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించలేదని, మందుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. షుగర్ పరీక్షల మందులు గానీ, అవసరమైన పరీక్షల కిట్లు గాని లేవన్నారు. కామెర్ల వంటి రోగాల నిర్ధారణ పరీక్షలు చేయలేని పరిస్థితి ఉందన్నారు. ప్రసవాల సమయంలో మత్తు వైద్య నిపుణులు, ప్రసూతి వైద్య నిపుణులు, శస్త్ర చికిత్స నిపుణులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పిల్లల వైద్య నిపుణులు, రేడియాలజిస్టు పోస్టులను భర్తీ చేయాలన్నారు. గర్భిణులను ప్రసవాల కోసం ఏలూరు తరలించాల్సి వస్తోందని, ఇలాంటి పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించాలన్నారు. ఈ సమస్యలపై వైద్యులను వివరణ కోరగా వైద్యులు, సిబ్బంది, మందుల కొరత విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించామని చెప్పారని లింగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బృందం సభ్యులు వై.సాల్మన్‌రాజు, కట్టా భాస్కరరావు, ఎం.పానకాలు పాల్గొన్నారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

హాస్టల్ బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లలు ఇప్పటి నుండే ప్లాన్ చేసుకుని అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఇబ్రహీం షరీఫ్ అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆదివారం పాన్ ఇండియా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో చట్టం, ర్యాగింగ్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, నిర్బంధ విద్య హక్కు చట్టం గురించి వివరించారు. చుట్టుపక్కల గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు, పోలీసులకు, స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఏ ఒక్కరూ అన్యాయానికి గురి కాకూడదని, ఉచిత న్యాయానికి అందరూ అర్హులేనని చెప్పారు. ఈ కార్యక్రమములో న్యాయవాదులు చైతన్య, మీసాల రమేష్, కనకదుర్గ, మౌనిక, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మంగరత్నం, హాస్టల్ వార్డెన్ స్వర్ణలత, చింతలపూడి ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

వికలాంగునికి వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అగాపే స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్డ ఆశిబాబు వితరణతో వికలాంగ వృద్ధుడికి వీల్‌చైర్ అందించారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అగాపే సంస్థ వ్యవస్థాపకులు ఆశిబాబు చేతులు మీదుగా ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురానికి చెందిన వయోవృద్ధుడు గాది రామారావుకు వీల్‌చైర్ ఆదివారం అందించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సేవలో నిరంతరాయంగా సేవలు అందిస్తున్న అగాపే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్డ ఆశిబాబు జీవితం పలువురికి వ్యక్తిత్వ వికాస స్ఫూర్తిపాఠమన్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా దాతల ద్వారా ఎందరికో చేయూతనిస్తూ ఆశిబాబు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ధనకుమార్, డివైఎఫ్‌వై మండల కార్యదర్శి సుభాని, రామారావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పెదకామనపూడిలో 'బాదుడేబాదుడు'

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని పెదకామపూడిలో ఆదివారం బాదుడేబాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు కూడా లేకుండాపోయిందన్నారు. వైసిపి నాయకుల అరాచకాలు రోజు రోజుకు పెట్రేగిపోతున్నాయన్నారు. ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సిహెచ్.శోభనాద్రిచౌదరి, ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, నాయకులు దావు నాగరాజు, వి.కొండ, పి.పాండురంగారావు, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, యర్రా రాంబాబు, ఆరట్ల నాగరాజు, రెడ్డి నాగరాజు, పి.కనకరావు, పంతగాని సురేష్ పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు భద్రకాళి మందిరం ఆలయంలో ఆదివారం చేనేత కార్మికుల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంఘం గౌరవ సలహాదారుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, దేవస్థానం మాజీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గణపవరం : కార్తీక వనసమారాధనల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు బైరిబోయిన మాల్యాద్రి అన్నారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సరిపల్లి, గణపవరం, భువనపల్లి గ్రామాలకు చెందిన కిరణ మర్చంట్ వర్తకులు స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. వర్తక సంఘంలో విశిష్ట సేవలందించిన వ్యక్తులను, గణపవరం ప్రెస్ క్లబ్ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ కార్యదర్శి శేగుసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు ఉప్పల కాశి, కోశాధికారి జువ్వల వెంకట సుబ్బారావు, ఇందుగుల మురళి, వన సమారాధన ఛైర్మన్ మిరియాల వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలంలో ఆర్‌ఎంపి వైద్యుల కార్తీక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఆర్‌ఎంపి వైద్యులు వారి కుటుంబాలతో పాల్గొన్నారు. ఆర్‌ఎంపి వైద్యుల అధ్యక్షులు సతీష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ఫేస్‌బుక్ ఆత్మీయ సమ్మేళనం

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో ఫేస్ బుక్ స్నేహితుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఒకచోట కలుసుకుని ఆనందంగా గడిపారు. చింతల పూడికి చెందిన సయ్యద్ ఖలీల్ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టు పెట్టారు. దీనికి ఆకర్షితులైన అనేకమంది ఆయనను సంప్రదించి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సోషల్ సర్వీస్ చేస్తున్న వివిధ మండలాలకు చెందిన వారిని ఎంపికచేసి, ఘనంగా సత్కరించారు. సుమారు 200 మందికిపైగా ఆత్మీయులు ఒక చోట కలుసుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఖలీల్‌ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంపా కృష్ణ, దిలీప్, సిటీ మెడికల్ దుర్గారావు, కాంతారావు పాల్గొన్నారు.



వీరే ఫేస్‌బుక్ స్నేహితులు

నేరాలు-ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం... మండలంలోని అన్నపనేనివారిగూడెం గ్రామంలో ఒక పూరి గుడిసెలో నిల్వచేసిన 16 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. బియ్యానిన స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కొయ్యలగూడెం : పేకాట స్థావరాలపై ఆదివారం దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జిజె.విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామనుజపురంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉపాధ్యాయుని ఇంటిలో చోరీ

భీమడోలు: మండలంలోని పూళ్లలో చోరీ జరిగింది. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని జంగంవీధికి చెందిన గోవర్ధన్‌రావు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో వేరే గ్రామానికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో సామగ్రి చెల్లాచెదరుగా ఉండటం చూసి, చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో భద్రపరిచిన మూడు కాసుల బంగారం, వెండి గిన్నె, సెల్ ఫోను చోరీకి గురైనట్టు బాధితులు తెలిపారు. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి

శ్రీరామలింగేశ్వర ఆలయ ఛైర్మన్ మీసాల రామకృష్ణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఛైర్మన్ పదవికి వన్నెతీసుకువచ్చేలా పని చేస్తూ గత రెండేళ్లుగా దాతల సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నానని మండలంలోని గురజ శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానం (శివాలయం) ఛైర్మన్ మీసాల రామకృష్ణ అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన శివాలయం దేవస్థాన ఛైర్మన్‌గా తాను 2020 నవంబర్ 11న ప్రమాణస్వీకారం చేశానన్నారు. వైసిపిలో చేసిన సేవలను గుర్తించి ఎంఎల్ఎ డిఎన్ఆర్ తనను శివాలయం ఛైర్మన్‌గా నియమించారన్నారు. వైసిపిలో చేరి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో, గ్రామస్థాయిలో కీలకంగా వ్యవహరించానన్నారు. ఆధ్యాత్మిక భావన పెంపొందించుకొని ఆలయాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అప్పగించిన పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తానని, శివాలయాన్ని మరింత తీర్చిదిద్ది భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. దాతల సహకారంతో భక్తులకు మరిన్ని సేవలు అందిస్తానని తెలిపారు.

చేసిన అభివృద్ధి పనులు



ఆలయ ఛైర్మన్ రామకృష్ణ

గురజ గ్రామ ముఖద్వారం వద్ద రూ.3.30 లక్షలతో శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామ లింగేశ్వర స్వామి ముఖ ద్వారం నిర్మాణం చేపట్టామన్నారు. రూ. మూడు లక్షలతో ఆలయానికి రంగులు వేశామన్నారు. రూ.మూడు లక్షలతో భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో నూతనంగా 80 యూనిట్లు నాపరాయి పరిచామని, ఏనిమిది బెంచీలు ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.50 వేలతో రావిచెట్టు, జూచెట్టు, జమ్ముచెట్టులకు దిమ్మలు ఏర్పాటు చేసి ఆలయ ప్రాంగణంలో ఉన్న తోటను అభివృద్ధి చేశామని చెప్పారు. 2021లో గాలి వానకు విరిగిపోయిన ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, పున:ప్రతిష్ట, అనంతరం ఏడు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం గత మే నెల 22వ తేదీన ఎంఎల్ఎ డిఎన్ఆర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు రూ.10 లక్షలు ఖర్చు చేశామన్నారు.

చేయాల్సిన పనులు

దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న ముఖమండపం శిథిలావస్థకు చేరిందని, దాని స్థానంలో నూతన ముఖమండపం దాతలు, దేవాదాయ శాఖ అధికారుల సహకారంతో నిర్మించాలనే ఆలోచన ఉందని, కార్యరూపం దాల్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో పది అడుగుల మేర శివుని విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. డివిజన్ స్థాయిలో ఇంత అతిపెద్ద ప్రసిద్ధి చెందిన శివాలయం ఎక్కడ లేదన్నారు. ఏటా ఆశ్వీజ మాసంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్తీక మాస పూజలు, శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు భారీగా భక్తజనం విచ్చేస్తారన్నారు. ఈ నెల 22న కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఎంఎల్ఎ డిఎన్ఆర్ ముఖ్యఅతిథిగా రానున్నట్లు చెప్పారు. కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్రసరస్వతి 60 ఏళ్ల క్రితం అమ్మవారి విగ్రహాన్ని శివాలయంలో ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ఆలయ మేనేజర్, ఎస్.కృష్ణాకిషోర్, ఆలయ కమిటీ సభ్యులు, మిత్రబృందం, దాతల సహకారంతో శివాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చాయశక్తులా తనవంతు కృషి చేస్తానని ఛైర్మన్ రామకృష్ణ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో ఇళ్లు నిర్మించాలి : సిపిఎం


ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న ఇంటి నిర్మాణాలు నాసిరకంగా చేపడుతున్నారని సిపిఎం మండల కన్వీనర్ ఆర్‌విఎస్.నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెంలో నిర్మిస్తున్న జగనన్న గృహ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు చేపట్టడంలేదని తెలిపారు. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. నాణ్యత లేకుండా నిర్మించి ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడవద్దని హెచ్చరించారు. పునాదులు గట్టిగా లేకుండా ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతా ప్రమాణాలలో పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

వైద్య ఖర్చులకు పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు (1992 బ్యాచ్) తమ సహచర విద్యార్థి కుమార్తె వైద్య ఖర్చులకు రూ.ఏడు లక్షల విరాళాలను చెక్కు రూపంలో అందించినట్లు పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు పెరుమాళ్ల శ్రీనివాసరావు తెలిపారు. తమ బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని కుటుంబం తాడేపల్లిగూడెంలో ఉంటున్నారని, వారికి ఇద్దరు కుమార్తెలని, వారిలో ఒకరు ఇంటర్ చదువుతోందని శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ చదివే కమార్తెకు బ్లడ్ క్యాన్సర్ అని, ఈ క్రమంలో వైద్య ఖర్చులకు పూర్వవిద్యార్థులంతా కలిసి రూ.ఏడు లక్షలు, దాతల నుంచి మరికొంత ఆర్థిక సాయాన్ని కుమార్తె తండ్రి కాశీవిశ్వేరరావుకు ఆదివారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సంఘం కార్యదర్శి పొన్నాడ



చెక్కును అందిస్తున్న పూర్వవిద్యార్థులు

సూర్యారావు, సిగిరెడ్డి శ్రీనివాసరావు, పులిబంటి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. కుటుంబసభ్యులు సాయం అందించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



ర్యాలీలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టివి.ఉమామహేశ్వరరావు కోరారు. వారోత్సవాల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో భీమడోలు పురవీధుల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నిర్వహణ చేపట్టిన గ్రంథ పాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయం ద్వారా అందుబాటులో ఉన్న సేవలు, రానున్న కాలంలో మరింతగా అందుబాటులో రానున్న ఇతర సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మండే సుధాకర్, అల్లూరి నాగబాబు పాల్గొన్నారు.

కలిదిండి : రాష్ట్ర ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించే 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను మండలంలోని పడమటిపాలెంలో కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాఖ గ్రంథాలయాధికారి జె.రమేష్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, వైస్ ఎంపిపి కూసంపూడి కనకదుర్గారాణి, ఎఎంసి ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, వైస్ ఛైర్మన్ పాము వీర వెంకట రవి కుమార్, పడమటిపాలెం, కలిదిండి, కొండంగి, గుర్వాయిపాలెం, గోపాలపురం సర్పంచులు సానా మీనా సరస్వతి, మసిముక్కు మారుతీప్రసన్న, తిరుమలశెట్టి జ్యోతి, బత్తిన ఉమామహేశ్వరరావు, అనపర్తి వడ్డికాసులు పాల్గొన్నారు.

ఆకాశం మేఘావృతం.. ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మూడురోజులుగా ఆకాశం మేఘావృతమై వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో సార్వా వరి కోతలకు సిద్ధం కాగా, కొన్నిచోట్ల కోతలు పూర్తవుతున్నాయి. ఈ తరుణంలో ఆకాశం మబ్బులుగా ఉండడంతో ఎప్పుడు వర్షం పడుతుందోననే భయంతో రైతులు కలవరపడుతున్నారు. మండలంలో చిగురుకోట, పెదకామనపూడి, చినకామనపూడి గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. రైతులు మిషన్లతో కోసిన ధాన్యం గట్లపై అరబెట్టుకుంటున్నారు. మరి కొంతమంది పడిపోయిన స్వర్ణ వరిపైరు కూలీలతో కోత కోయిస్తున్నారు. మహిళా కూలీలకు రూ.400, పురుషునికి రూ.500 చొప్పున కూలిగా రైతులు చెల్లిస్తున్నారు. మబ్బుల కారణంగా అరబెట్టిన ధాన్యం సరిగ్గా అరడం లేదంటూ రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతుల దగ్గర ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. మండలంలో చిగురుకోటలో మాత్రమే రైతు భరోసాకేంద్రంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. మిగిలిన గ్రామాల్లో ఇంకా ప్రారంభించలేదు.

దీంతో తుపాన్ భయంతో కోసిన ధాన్యం ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. పంట చేతికందే సమయంలో తుపాన్ సంభవిస్తే పంట నేల కొరిగి ధాన్యం గింజలు మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు బెంబేలెత్తుతున్నారు. ఎకరాలకు రూ.25 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, తుపాన్‌తో పంట చేతికి వస్తుందో లేదో తెలియడంలేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ములగలంపల్లి సొసైటీ అధికారుల తీరు వివాదాస్పదం

రైతుల ఆగ్రహం - స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గత కొన్నిరోజులుగా రుణాల విషయంలో రైతులకు సొసైటీ కార్యదర్శుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అయితే దీనిపై సంబంధిత సొసైటీ ఉన్నతాధికారులు మాత్రం పూర్తిస్థాయి విచారణ చేపట్టకపోవడం పట్ల సొసైటీ తీరుపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న రుణాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, రుణాలు చెల్లించిన వారికి బిల్లులు ఇవ్వకుండా ఎక్కువ మొత్తంలో రికార్డుల్లో నమోదు చేసి కార్యదర్శి రైతులను ఇబ్బందులు పెడుతున్నా రని తెలిసింది. ఈ వ్యవహారంపై పరపతిసంఘం ఉన్నతాధికారులు మాత్రం స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. ములగలంపల్లి సొసైటీలో గత నెల 24న మొండిబకాయిలున్న 15 మంది రైతుల స్థిరస్తులను సొసైటీ యాజమాన్యం వేలం వేస్తున్నట్లు ఓ ప్రముఖ దినపత్రికలో ప్రకటన ఇచ్చారు. అయితే దానికి సంబంధించి కొంతమంది రైతులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో వేలం ప్రక్రియ నిలిచింది. వెంటనే కార్యదర్శి తీసుకున్న రుణాలను చెల్లించాలని రైతులపై వత్తిడి తెచ్చారు. అయితే రైతులు మాత్రం అందుకు విరుద్ధంగా తీసుకున్న రుణం కంటే అదనంగా రుణాలు కట్టాలని వేధిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా పరపతి సంఘం ఉన్నతాధికారులు రెండువర్గాలతో చర్చించి రికార్డులను పరిశీలించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా ఆదనపు ఎస్‌పి కె.చక్రవర్తి అన్నారు. ఏలూరులోని సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ఆదివారంతో ముగిసింది. న్యామంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సురేష్ చంద్ర స్మారక జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులను వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా నైపుణ్యాన్ని పెంచుకుంటూ ముందుకుసాగుతారన్నారు.

డిఎస్‌పిగా అశోక్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - నూజివీడు



అశోక్‌కుమార్‌గౌడ్

నూజివీడు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో నూతన డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన బి.శ్రీనివాసులు వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో అశోక్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అశోక్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వ అధికారులు, మీడియా ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు నూతన డిఎస్‌పికి సాదారంగా ఆహ్వానం పలికారు.

కోర్లగుంటలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు మండలంలోని కోర్లగుంట గ్రామంలో ఉన్న గుర్రాలమ్మ, గుర్రాలయ్య దేవతు కళ్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు ఆరువేలమందికి భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న జగనన్న ఇళ్లు : జనసేన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జగనన్న ఇళ్లు పేదలకు కన్నీళ్లు పెట్టిస్తున్నాయని జనసేన చింతలపూడి నియోజకర్గ ఇన్‌ఛార్జి మేక ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం జనసేన ఆధ్వర్యంలో పట్టణంలోని టిడ్కో నిర్మాణాలు, ఎల్-1,2,3,4 లే అవుట్‌లను పార్టీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లయినా ఇళ్ల నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయన్నారు. ఎల్-4 జగనన్న కాలనీకి నీటి సౌకర్యం లేక లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్-1 కాలనీ లబ్ధిదారులకు సుద్ద కాలువను ఆనుకుని ఉన్న భూమిలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆ భూముల కొనుగోలులో అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇప్పటికే ఆ స్థలాలు చెరువును తలపిస్తున్నాయన్నారు. ఆ నీళ్లలోనే ఇల్లు కట్టుకోమని లబ్ధిదారులను అధికారులు ఒత్తిడి చేయడం బాధాకరమన్నారు. ఇళ్లు నిర్మించక పోతే పట్టాలు రద్దు చేసి వేరే వాళ్లకు ఇస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకు ల నుండి ఇఎంఐలు కట్టమని ఒత్తిళ్లు వస్తున్నాయని తెలిపారు. కానీ టిడ్కో ఇళ్లు మాత్రం లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదని లబ్ధిదారులు ఘోల్లుమంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకుల రాకేష్, షేక్ పీరూ, వలవల తాతాజీ, డి.రాజీ, కోసూరి, కనకమహాలక్ష్మి, మనోజు, బాధరాల నరేష్, యడ్ల చంటి, ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్యవైశ్యుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలిదిండి

ఇటీవల వేడి నీళ్ల బకెట్‌లో పడి గాయపడిన చిన్నారి(3) వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్యవైశ్యులు సేకరించిన రూ.70 వేలను కుటుంబ సభ్యులకు ఆదివారం గుర్వాయిపాలేనికి చెందిన చిన్నారి తండ్రి చెన్నా శివకుమార్‌ను ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు పూర శ్రీధర్, టౌన్ సంఘం నాయకులు, కలిదిండి ఎంపిటిసి నీలి సుమన్, జిల్లా ప్రాంతీయ కార్యదర్శి చెక్కా జగన్ మోహన్, బూర్లే కిరణ్, వాయుగుండ్ల రామకృష్ణ, స్థానిక ఎంపిటిసి గోదావరి సత్యనారాయణ కలిసి సాయం అందచేశారు.

నేడు అంగన్‌వాడీల డిమాండ్స్ డే

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈనెల 14వ తేదీన అంగన్‌వాడీ వర్కర్స్ డిమాండ్స్ డే సందర్భంగా ఆయా సెంటర్ల పరిధిలోని అంగన్‌వాడీలు తమ సమస్యలపై సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లో జరిగిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు జె.నాగవేణి, జి.సుబ్బాయమ్మ, జగదీశ్వరి, జి.విమల, జయ, శాంతి కుమారి, మరియమ్మ, మస్తాన్‌బి, రాజామణి, వరలక్ష్మి, బోడెమ్మ, శిరోమణి, శుక్లబోయిన రాంబాబు పాల్గొన్నారు.

'ప్రజల అవసరాలు తీర్చలేని చేతగాని ప్రభుత్వం వైసిపి'

నూజివీడు: ప్రజల ప్రాథమిక అవసరాలు కూడా తీర్చలేని ప్రభుత్వం వైసిపి నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు పట్టణంలోని రెండో వార్డు కొప్పుల వెలమపేటలో 'మన ఇంటికి మన ముద్దరబోయిన' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రజల అవసరాలను తెలుసుకొని వాటిని పూర్తిచేశానని జగన్ రెడ్డి చెబుతుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిభిన్నంగా ఉందన్నారు. కనీసం డ్రెయినేజీల్లేక పారిశుధ్యం అధ్వానంగా మారి వీధిలైట్లు వెలగగా డివిజన్ కేంద్రమే మారుమూల ప్రాంతాలుగా మారిపోతున్నాయని విమర్శించారు. పెళ్లి కానుకను నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వాల పథకాలను రద్దుచేసి పేదలకు అందిస్తున్న లబ్ధిని నిలిపివేసిందంటూ స్థానికులు ముద్దరబోయిన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, మాజీ కౌన్సిలర్ కందుపల్లి చెన్నారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.